క్లుప్తంగా

వైఎస్ జగన్‌తో లింగారెడ్డి భేటీ



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న రాష్ట్ర అధికార ప్రతినిధి లింగారెడ్డి

పుట్టపర్తి టౌన్: తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి లింగారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు.

విద్యారంగ సమస్యలపై ఉద్యమించండి



వైఎస్ జగన్‌తో విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాజేంద్రప్రసాద్ యాదవ్

కదిరి టౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లం రాజేంద్రప్రసాద్ యాదవ్ తెలిపారు. బుధవారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేతను కలిశామన్నారు. ఈ సందర్భంగా కూటమి విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంలోను, యువతకు ఉద్యోగ అవకాశాలు, నిరుద్యోగ భృతి కల్పించడంలోను కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని, వీటిపై పోరాడాలని సూచించారని చెప్పారు.

ఎంఎస్‌ఎంఈ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

గాండ్లపెంట: మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఎంఎస్‌ఎంఈ రుణాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి బుధవారం తెలిపారు. 21 నుంచి 55 ఏళ్లలోపు వయసు కలిగిన మైనార్టీ అభ్యర్థులు ఏపీఓబీఎంఎంఎస్ వారి అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, ఫోన్‌నంబరు(ఆధార్‌లింక్), బియ్యం కార్డు, విద్యార్హత ధ్రువ పత్రాలు, ఈ మెయిల్ ఐడీ దరఖాస్తుకు జత చేయాలని చెప్పారు.

పారదర్శకంగా పనిచేయండి



రెవెన్యూ అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్డీఓ

ముదిగుబ్బ: రెవెన్యూ అధికారులు పారదర్శకంగా పనిచేయాలని ఆర్డీఓ మహేష్ సూచించారు. బుధవారం ముదిగుబ్బ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన బాధ్యతగా అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. పారదర్శకతతో సేవలందించాలనేది బాధ్యత ప్రతి అధికారిపై ఉందన్నారు. రెవెన్యూ రిజిస్ట్రర్లు పెండింగ్ సర్వీసెస్, పెండింగ్ అర్జీలను పరిశీలించి వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు.

ఏఓగా బాధ్యతల స్వీకరణ



ఏఓ మాధురి

కనగానపల్లి: మండల వ్యవసాయాధికారి (ఏఓ)గా బి.మాధురి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా కనగానపల్లి ఏఓగా పని చేస్తున్న కృష్ణకుమారి అనంతపురానికి బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో వైఎస్సార్ కడప జిల్లా బద్వేలులో టెక్నికల్ ఏఓగా పనిచేస్తున్న మాధురిని నియమించారు. ఈ నేపథ్యంలో బుధవారం మాధురి స్థానిక వ్యవసాయ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆమెకు ఏఈఓ రామాంజినేయులు, స్థానిక వ్యవసాయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అనాథకు అంత్యక్రియలు



మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్తున్న సొసైటీ సభ్యులు

పుట్టపర్తి టౌన్: అనాథలు, ఆర్థికస్తోమత లేని వారికి ఖిద్మత్- ఎ-ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అన్నీ తామై అంత్యక్రియలు నిర్వహించి ఆత్మబంధువులుగా నిలుస్తున్నారు. బుధవారం ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్ సమీపంలో వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందారు. కొత్తచెరువు పోలీసులు కేసు నమోదు చేశారు. అతని వద్ద వివరాలు ఏమి లేకపోవడంతో అనాథ శవంగా గుర్తించారు. దీంతో స్థానికులు ఖిద్మత్ ఎ-ఖల్క్ సొసైటీ సభ్యులను ఆశ్రయించారు. కమిటీ సభ్యులు షామీర్, ఆలీ, మాతంగి సాయి,ఆదిల్, సల్మాన్, ఫైజల్ అన్నీతామై అంత్యక్రియలు నిర్వహించారు.

ఘనంగా ఐదో సరిగెత్తు

బత్తలపల్లి: మొహర్రం వేడుకల్లో భాగంగా బుధవారం ఐదోసరిగెత్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. బత్తలపల్లిలో ఖాసీంస్వామికి నిత్యపూజ నివేదన చేశారు. ఉదయం ముజావర్లు మహబూబ్‌బాషా, ఖాసీంపీరా, ఫక్రుద్దీన్, ఖాశీంవల్లి చావిడిలో ఖాసీంస్వామిపీరుకు ఫాతెహా చేశారు. ఈ సందర్భంగా ముస్లింలు ఫక్కీరుబాబాలుగా దీక్షలు స్వీకరించారు. తమ ఇళ్ల వద్ద నుంచి మేళాలతో ప్రత్యేకంగా చావిడి వద్దకు చేరుకుని ముజావర్లతో మెడలో దండ వేయించుకున్నారు.

ప్రారంభమైన వేడుకలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పలు వార్డుల్లో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. బుధవారం కొత్తపేటలో చిన్న సరిగెత్తుకు పీర్లు ముస్తాబయ్యాయి. పీర్లస్వాములు హిమామి హసేన్, హిమామి హుస్సేన్, హిమామీ ఖాసీం, మౌలాలి, బాబావలి, జలాలి టోపీ సాహెబ్‌లను పూలమాలలు, వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కార్యనిర్వాహకులు బిల్లే శ్రీనివాసులు, చంద్ర, బాషా, హసేన్, నూర్, హిందూపురం ఫక్రుద్దీన్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన పీర్లు

కనగానపల్లి: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా బుధవారం కనగానపల్లిలోని చావిడిలో పీర్లస్వాములను కొలువుదీర్చారు. ఈ సందర్భంగా దస్తగిరి, కుళ్లాయి, వన్నూస్వామి పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

మొహర్రం నిర్వహణకు అనుమతి తప్పనిసరి

బత్తలపల్లి: మొహర్రం (పీర్ల పండుగ) నిర్వహణకు అనుమతులు తప్పనిసరి అని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్‌ఐ సోమశేఖర్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ గ్రామాల్లో పీర్ల పండుగ చేయాలనుకునేవారు ముందుగా కమిటీగా ఏర్పడి పోలీస్ స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాలకు అవసరమైతే పోలీస్ సిబ్బందిని బందోబస్తుకు ఏర్పాటు చేస్తామన్నారు. గత ఏడాది పండుగ సందర్భంగా ఘర్షణలు చోటు చేసుకున్న గ్రామాల ప్రజలు పండుగ అనుమతుల కోసం వచ్చిన వారిని పోలీసులు తహసీల్దార్ స్వర్ణలత ఎదుట బైండోవర్ చేశారు.



ధర్మవరం కొత్తపేటలో ప్రత్యేక అలంకరణలో పీర్ల స్వాములు



బత్తలపల్లిలో పూజలు అందుకుంటున్న ఖాశీంస్వామి పీరు

భక్తి శ్రద్ధలతో ముత్యాలమ్మకు జ్యోతులు



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ



జ్యోతులతో ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో వెలసిన ఓబుళ లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండేళ్లకోసారి జరిగే ఈ ఉత్సవాలను స్థానికులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి గ్రామ దేవత ముత్యాలమ్మదేవికి జ్యోతులు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు అమ్మవారి మూల విరాట్‌కు అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని దేవాలయం ముందు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మొక్కులో భాగంగా జ్యోతులను ఊరేగింపుగా తీసుకువచ్చి దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు.

బుద్ధిమాంద్యం బాలుడు అదృశ్యం



నవీన్ (ఫైల్)

పుట్టపర్తి టౌన్: వెంగలమ్మ చెరువు గ్రామానికి చెందిన కల్లూరి నవీన్ అనే 16 ఏళ్ల బుద్ధిమాంద్యం బాలుడు కనిపించడం లేదు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎన్నిచోట్ల వెదికినా జాడ కానరాకపోవడంతో తల్లిదండ్రులు రూరల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 94407 96839 నంబర్‌కు తెలియజేయాలని ఎస్‌ఐ లింగన్న కోరారు.

మహిళకు తీవ్ర గాయాలు

తనకల్లు: నల్లగుట్లపల్లి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రమాదేవి అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. సారగుండ్లపల్లికి చెందిన రమాదేవి కారులో తన బంధులతో కలిసి మదనపల్లికి బయలుదేరారు. నల్లగుట్లపల్లి వద్దకు రాగానే కారును బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రమాదేవికి బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వందేమాతరం టీం సభ్యులు ఉచిత అంబులెన్స్‌లో ఆమెను తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తూ ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు కేతినేని రాజు, శ్రీధర్, రామాంజనేయులును సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సర్పంచ్ నాగేంద్రమ్మ, నరసింహులు, హెచ్‌ఎం శేఖర్ తదితరులు సత్కరించి, ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఎక్కడ ఉద్యోగం చేసినా విధుల పట్ల అంకిత భావంతో మెలగాలని, విద్యార్థులకు ఉత్తమ బోధనలందించాలని ఎంఈఓలు గోపాల్‌నాయక్,మోహన్‌బాబు సూచించారు.

శక్తి యాప్‌పై అవగాహన



శక్తి యాప్‌పై ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది, విద్యార్థులు

పుట్టపర్తి: ప్రస్తుత పరిస్థితులలో కళాశాల విద్యార్థులు శక్తి యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మక్బూల్ హుస్సేన్ సూచించారు. శక్తి యాప్ ప్రతినిధులు బుధవారం కళాశాలలో యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ పాల్గొని మాట్లాడారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు శ్రీనివాసులు, నరసింహ, చందన, యశోద, వైస్ ప్రిన్సిపాల్ రవి కుమార్, శ్రీనివాసులు, ఓబిలేసు, సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు సిబ్బంది, పోలీసులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

మోకాళ్లపై నిల్చుని నిరసన



నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘం నాయకులు

ధర్మవరం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం ఏడో రోజూ కొనసాగాయి. మున్సిపల్ కార్యాలయం ముందు చేపట్టిన రిలే దీక్షల్లో ఇంజినీరింగ్ సెక్షన్ కార్మిక సంఘం జాయింట్ కార్యదర్శి బాబు, కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కార్యదర్శి మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులకు 17 రోజులకు సమ్మె కాలపు సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ యూనియన్‌తో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో వాటర్ వర్క్స్, పార్క్ స్ట్రీట్ లైట్, కంప్యూటర్ ఆపరేటర్స్ వర్కర్స్ తదితర విభాగంలో పనిచేస్తున్న వారికి తల్లికి వందనం పథకం, సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, జీఓ 36 ప్రకారం రూ.24,500 వేతనం అమలు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కారం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల నాలుగో తేదీ నుంచి అత్యవసర సేవలు కూడా బంద్ చేసి, పూర్తిస్థాయి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. నిరసనలో సంఘం నాయకులు అనిల్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

చాముండీదేవిగా సప్తమాతృక అమ్మవారు



పరిగి: మండల కేంద్రంలోని సప్తమాతృక ఆలయంలో ఆషాఢ గుప్త నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శ్రీచాముండీదేవి అలంకరణలో బుధవారం భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు చిన్నాభిన్నం



మాట్లాడుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ చంద్రమణి

ధర్మవరం అర్బన్: మాదక ద్రవ్యాలతో జీవితాలు చిన్నాభిన్నం అవుతాయని ఎక్సైజ్ సీఐ చంద్రమణి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ చంద్రమణి మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాకు బానిసలై డ్రగ్స్ వినియోగం, మాదక ద్రవ్యాలు ఉపయోగించడం చేస్తూ ఆరోగ్యాలను పాడుచేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉండి బంగారు భవితకు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, ఎక్సైజ్ ఎస్‌ఐలు చాంద్‌బాషా, నాగరాజు, కళాశాల లెక్చరర్లు బాలజోషి, రాజేష్, అనూష, ఉమా తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి



సమ్మెను జయప్రదం చేయాలని కోరుతున్న నాయకులు

ఓడీచెరువు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల తొమ్మిదిన చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఓడీచెరువులో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు అనుకూలంగా ఉన్న 44 చట్టాలను కేంద్రం రద్దుచేసి కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేలా తయారుచేసిన చట్టాలకు అనుకూలంగా రాష్ట్ర మంత్రివర్గం తీర్మానాలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. వీటిని వ్యతిరేకిస్తూ 9న చేపట్టే దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకులు రమణ, అంగన్‌వాడీ కార్మికులు, ఓడీచెరువు ప్రాజెక్టు కార్యదర్శి రంగమ్మ, అధ్యక్షులు ఆశీర్వాదమ్మ, కార్యకర్తలు కిష్టమ్మ, మణిమాల, సునీత, విమల, సీఐటీయూ మండల కన్వీనర్ కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు

'సుపరిపాలన'లో సౌకర్యాల కోసం మొర

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లిలో బుధవారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. గ్రామంలో విద్యుత్ స్తంభాలు, డ్రెయినేజీలు, పక్కాగృహాలు మంజూరు చేయాలని ప్రజలు కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీక్రిష్ణ, ఎంపీడీఓ పోలప్ప పాల్గొన్నారు.

రిటైర్డు ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు



రిటైర్డు పోలీసులను సత్కరిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పని చేస్తూ రిటైర్డు అయిన పోలీసులు రెడ్డెప్ప, ఆంజనేయులు, నజీర్ అహమ్మద్, లక్ష్మన్న, నాగరాజు, గోపీకుమార్, శ్రీరాములు, అబ్దుల్ కలాం ఆజాద్‌కు బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. ముఖ్య అతిథిగా ఎస్పీ రత్న హాజరై వారిని పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ విశ్రాంత జీవితం ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్పీలు విజయకుమార్, ఆదినారాయణ, ఎస్పీ సీఐ బాల సుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్‌ఐలు వలి, మహేష్, సూపరింటెండెంట్‌లు సర్వస్వతి, మల్లికార్జునతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పుట్టపర్తి టౌన్: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి గోపీనాయక్ తెలిపారు. బుధవారం కొత్తచెరువు మార్కెట్ వీధిలో జాతీయ డెంగీ మాసోత్సవాల్లో భాగంగా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో ఎక్కువగా నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. నీటి నిల్వలు ఉంటే దోమలు వృద్ధి చెంది వ్యాధులు వ్యాపింపజేస్తాయన్నారు. ముఖ్యంగా పగటి పూట కుట్టే దోమల వల్ల డెంగీ జ్వరాలు వస్తాయని, వ్యక్తిగత శుభ్రతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ వెంకటేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

10 నుంచి క్రికెట్, కబడ్డీ పోటీలు

ధర్మవరం అర్బన్: ధర్మవరం తాలూకా పరిధిలోని స్కూల్స్ జట్లకు ఈ నెల పదో తేదీన పట్టణంలోని ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో క్రికెట్, కబడ్డీ పోటీలు ప్రారంభించనున్నట్లు క్రికెట్ కోచ్ రాజశేఖర్, కబడ్డీ కోచ్ పృథ్వీ బుధవారం తెలిపారు. తాలూకాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీలకు అర్హులన్నారు. బాలురు, బాలికల పాఠశాలలకు వేరువేరుగా మ్యాచ్‌లు ఉంటాయన్నారు. ఈ నెల 8లోపు పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 99859 29285, 99664 92540 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఎరువుల విక్రయాల నమోదు తప్పనిసరి



డీలర్లకు ఈ పాస్ యంత్రాలను పంపిణీ చేస్తున్న ఏడీఏ

ధర్మవరం రూరల్: ఎరువుల విక్రయాలను ఈ- పాస్ యంత్రాలలో రోజూ తప్పనిసరిగా నమోదు చేయాలని ఏడీఏ లక్ష్మానాయక్ డీలర్లకు సూచించారు. బుధవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఏడీఏ అధ్యక్షతన ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ కంపెనీకి సంబంధించిన మేనేజర్, మార్కెటింగ్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏడీఏ చేతుల మీదుగా ఎరువుల డీలర్లకు ఈ పాస్ యంత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ముస్తఫా, కోరమాండల్ మేనేజర్ శివకుమార్, అగ్రానమిస్టులు వెంకటేష్, హరికృష్ణ, ఎరువుల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో గ్రంథాలయ భవనం



తాడిమర్రిలో శిథిలావస్థకు చేరిన గ్రంథాలయ భవనం

తాడిమర్రి: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయం పక్కన గల గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరింది. పాత పంచాయతీ కార్యాలయ భవనంలో 1990లో గ్రంథాలయం ఏర్పాటైంది. 1997లో పక్కాభవనంలోకి గ్రంథాలయాన్ని మార్చారు. గత కొన్నేళ్లుగా భవనం సీలింగ్ పెచ్చులూడటం, వర్షానికి కారుతుండటం, పుస్తకాలు, రికార్డులు నానుతుండటంతో పాఠకులు, గ్రంథాలయ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్ల క్రితం మళ్లీ పాత పంచాయతీ కార్యాలయంలోని రెండు చిన్న గదులతో కూడిన భవనంలోకి గ్రంథాలయాన్ని మార్చారు. ఇక్కడ ఇరుకుగా ఉండటంతో పుస్తకాలు భద్రపరచడానికి, పాఠకులు కూర్చోవడానికి సమస్యగా మారింది. అధికారులు స్పందించి నూతన భవనం నిర్మించాలని పాఠకులు కోరుతున్నారు.

అభ్యసనా నైపుణ్యాలు అభివృద్ధి చేయాలి



కోటపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ రామానాయక్

తనకల్లు: కోటపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఎంపీడీఓ రామానాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిష్టర్లు, రికార్డులను పరిశీలించారు. చిన్నారులకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రాలలోని విద్యార్థులలో మంచి అభ్యసనా నైపుణ్యాలను అభివృద్ధి చేయాలని సూచించారు. అనంతరం గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌తో పాటు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు సమయ పాలన పాటించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పేదలకు నెలంతా ఉచిత కంటి వైద్యం



పోస్టర్ విడుదల చేస్తున్న కంటి వైద్యనిపుణులు నరసింహులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో నున్న మధు కంటి వైద్యశాలలో ఈ నెలంతా పేదలకు ఉచిత కంటివైద్య సేవలందిస్తామని కంటి వైద్య నిపుణులు డాక్టర్ నరసింహులు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను బుధవారం ఆయన విడుదల చేశారు. జాతీయ వైద్యుల దినోత్సవంతో పాటు ఆస్పత్రి స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెలంతా ఉచిత సేవలందించాలని నిర్ణయించామన్నారు. పేదలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, చేనేత నాయకురాలు జయశ్రీ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

తనకల్లు: పూలకుంటపల్లికి చెందిన మల్లీశ్వరి అనే వివాహిత అదృశ్యమైనట్లు ఎస్‌ఐ గోపి బుధవారం తెలిపారు. ఈమెకు కర్ణాటకలోని బిజిగనహళ్లికి చెందిన వ్యక్తితో వివాహమైంది. ఒక కుమారుడు సంతానం. గత మే నెలలో ఆమె పుట్టినిల్లు అయిన పూలకుంటపల్లికి వచ్చింది. జూన్ 12న ఆరోగ్యం బాగాలేదని మొలకలచెరువులోని ఆస్పత్రికి వెళ్లింది. తిరిగి మళ్లీ అప్పటి నుండి మల్లీశ్వరీ తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు పలు చోట్ల వెతికినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మల్లీశ్వరి తల్లి రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

అసభ్య ప్రవర్తనపై కేసు

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువులో మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదైంది. సీఐ మారుతీ శంకర్ తెలిపిన వివరాల మేరకు.. కొత్తచెరువు గ్రామంలోని పెనుకొండ రోడ్డు సమీపంలో వితంతు మహిళ నివాసం ఉంటోంది. ఈమె పెనుకొండ రోడ్డులో ఉన్న హోటల్‌లో పనిచేస్తోంది. సదరు హోటల్ యజమాని సుధాకర్ ఆమెపట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.